ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
నంద్యాల
జిల్లా వార్తలు 5
సోమవారం 6 జనవరి 2025



నేడు ప్రజా వినతుల స్వీకరణ

నంద్యాల కల్చరల్, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): కలెక్టరేట్‌లోని సెంటినరీ హాల్‌లో సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో వినతులు స్వీకరించనున్నట్లు కలెక్టర్ జి.రాజకుమారి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. పబ్లిక్‌గ్రీవియన్స్ రెడ్రస్సల్ సిస్టం (పీజీఆర్ఎస్)ద్వారా అర్జీలు స్వీకరిస్తామని ఉదయం 9.30గంటలకు జిల్లా అధికారులందరూ హాజరు కావాలని అన్నారు. జిల్లా కేంద్రంతో పాటు మండల, నియోజకవర్గ, డివిజన్ స్థాయిలో కూడా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఆమె తెలిపారు.





మొదటి బహుమతి ముగ్గు ఇన్‌సెట్లో విజేత గౌతమి



కర్నూలులో ముగ్గులను పరిశీలిస్తున్న న్యాయ నిర్ణేతలు

రంగవల్లుల జాతర

- కర్నూలు, ఆదోనిలో పోటీపోటీగా సాగిన ముత్యాల ముగ్గుల పోటీలు
- భారీగా తరలివచ్చిన నారీలోకం

కర్నూలు కల్చరల్/ ఆదోని, జనవరి 5 (ఆంధ్రజ్యోతి)

పుడమి తల్లికి మహిళలు ముగ్గులతో ముత్యాల హారాలు వేశారు...ధవళ కాంతుల తారలను నేలకు దించుతూ, ఇంద్రధనుస్సులోని సప్తవర్ణాలను ఇలకు తిలకంగా దిద్దారు. సంక్రాంతి లక్ష్మికి సుస్వాగతం పలుకుతూ... రంగవల్లికల సొబగులతో నేత్రానందభరితుల్ని చేశారు. మహిళలు ఎంతో శ్రమించి, ఓర్పుతో సృజనాత్మకత భావాలు వెల్లివిరిసేలా, తమలోని కళాత్మక నైపుణ్యాలను వెలికితీస్తూ వేసిన ముగ్గులన్నీ వేటికవే పోటీగా నిలిచాయి. రంగు రంగుల ముత్యాల ముగ్గులను వేసేందుకు మహిళలు పోటీ పడ్డారు. ఆంధ్రజ్యోతి- ఏబీఎన్ నిర్వహిస్తున్న సంతూర్ ముత్యాల ముగ్గుల పోటీలు... గార్డెనింగ్ పార్టనర్ క్రాఫ్టవారి పర్‌ఫెక్ట్.. ఫ్యాషన్ పార్టనర్ డిగ్‌సెల్ వారి సెల్సియా (ట్రెండీ మహిళల ఇన్నర్‌వేర్) ఆధ్వర్యంలో ఆదివారం ముగ్గుల పోటీలను ఘనంగా నిర్వాహించారు.

వివరాలు 7వ పేజీలో







మాట్లాడుతున్న టీజీ వెంకటేశ్, ఎమ్మెల్యే గౌరు చరిత, డీఆర్వో వెంకట నారాయణమ్మ, సమాచార శాఖ డీడీ జయమ్మ



కర్నూలులో బహుమతులు అందజేస్తున్న రాజ్యసభ మాజీ సభ్యుడు టీజీ వెంకటేశ్, ఎమ్మెల్యే గౌరు చరిత







కర్నూలులో ముగ్గులు వేస్తున్న మహిళలు







ఆదోనిలో ముగ్గుల పోటీల్లో పాల్గొన్న మహిళలు



కర్నూలులో బహుమతుల ప్రదానోత్సవంలో మహిళలు



ముగ్గులు వేయడానికి వస్తున్న మహిళలు

మంత్రి బీసీకి దరఖాస్తుల వెల్లువ



దరఖాస్తులు స్వీకరిస్తున్న మంత్రి బీసీ

బనగానపల్లె, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): రోడ్లు భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి కార్యాలయానికి ఆదివారం వందలాదిగా ప్రజలు తరలివచ్చి తమ సమస్యలను దరఖాస్తుల రూపంలో సమర్పించారు. ప్రజా సమస్యలను ఆలస్యం చేయకుండా ఎప్పటికప్పుడు పరిష్కరించాలని మంత్రి అధికారులను ఆదేశించారు. బనగానపల్లె కార్యాలయంలో ఉమ్మడి జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి టీడీపీ కార్యాలయం చేరుకోవడంతో మంత్రి స్వయంగా అర్జీలను స్వీకరించారు. అధికారులు ప్రజలను కార్యాలయాల చుట్టూ తిప్పవద్దన్నారు. ప్రజలను వేధించే అధికారులపై శాఖాపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. కర్నూలు, నంద్యాల జిల్లాల నుంచి వివిధ వర్గాల ప్రజలు కూటమి నాయకులు, కార్యకర్తలు తరలి వచ్చారు. బాధిత ప్రజలు తమ సమస్యలను మంత్రి దృష్టికి తీసుకురాగా సమస్యలపై మంత్రి సానుకూలంగా స్పందించి . న్యాయ బద్ధంగా ఉన్న సమస్యలను అక్కడికక్కడే పరిష్కరించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ దరఖాస్తులను పరిష్కరించడానికి కృషి చేస్తామన్నారు. వివిధ సమస్యలను మంత్రి దృష్టికి తీసుకుపోగా సానుకూలంగా స్పందించి సమస్యలను పరిష్కరించడం పట్ల అర్జీదారులు మంత్రికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో వివిధ ప్రాంతాల నుంచి ఎన్‌డీఏ కూటమి నాయకులు పాల్గొన్నారు.

రింగ్‌రోడ్డు పనులకు నేడు భూమి పూజ

బనగానపల్లె పట్టణంలో రూ.50 కోట్లతో నిర్మించనున్న రింగ్‌రోడ్డు పనులకు సోమవారం ఉదయం 9.30 గంటలకు మంత్రి బీసీ జనార్థన్ రెడ్డి భూమి పూజ చేయనున్నట్లు ఆర్అండ్‌బీ ఏఈఈ హంసేస్ ఆదివారం తెలిపారు. పాణ్యం రహదారిలో రింగ్ రోడ్డు పనులకు మంత్రి భూమి పూజ చేయనున్నారని చెప్పారు.

బోగస్ పింఛన్ల ఏరివేతకు రంగం సిద్ధం

- నేటి నుంచి జిల్లాలో వైద్య బృందాల పరిశీలన
- మూడు ప్రాంతాల్లో వైద్య పరీక్షలు
- అక్రమ పింఛనుదారుల్లో మొదలైన వణుకు



నంద్యాల జనవరి 5 (ఆంధ్రజ్యోతి): బోగస్ పింఛన్ల ఏరివేతకు కూటమి సర్కార్ శ్రీకారం చుట్టింది. ఈ మేరకు ఆదేశాలు కూడా జారీ అయ్యాయి. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో కొందరు అర్హత లేకపోయినా అధిక సంఖ్యలో అక్రమంగా సదరం సర్టిఫికెట్లు పొంది ఇప్పటికీ పింఛన్ పొందుతున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. అయితే ఏరివేత దిశగా ప్రస్తుత ప్రభుత్వం చర్యలు తీసుకోనున్న నేపథ్యంలో సర్టిఫికెట్లు మంజూరు చేసిన వైద్యుల్లో, ఇటు అక్రమంగా సర్టిఫికెట్లు పొందిన పింఛనుదారుల్లోనూ వణుకు మొదలైంది. జిల్లాలో వివిధ కేటగిరీల కింద 2,16,111 మంది పింఛన్ పొందుతున్నారు. 873 మంది రూ.15 వేల చొప్పున పింఛన్ పొందుతున్నారు.

నేటి నుంచి పింఛన్‌దారులకు వైద్య పరీక్షలు

పింఛన్ అందించే విషయంలో ప్రభుత్వం ఏమాత్రం ఆలస్యం చేయదనే విషయం అందరికీ తెలిసిందే. ప్రతి నెల ఒకటో తేదీనే.. ప్రతి పింఛనుదారుడికి ఎక్కడిక్కడ తమ పింఛను అందించే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. అయితే ఇదే క్రమంలో రాష్ట్రంలో కొన్ని ప్రాంతాల్లో అక్రమ పింఛన్‌ల విషయం వెలుగులోకి రావడంతో.. అనర్హతగల పింఛన్లను గుర్తించి తొలగించే విధంగా చర్యలు తీసుకుంది. ప్రభుత్వం మొదటి విడతలో భాగంగా దీర్ఘకాలిక జబ్బులతో రూ.15 వేలు పింఛన్ పొందుతున్న పింఛనుదారులను పరిశీలించి అనర్హులను గుర్తించాలని ఆదేశించింది. ఈ నేపథ్యంలో జిల్లాలోని నంద్యాల, బనగానపల్లె, శ్రీశైలం, పాణ్యం, ఆళ్లగడ్డ, నందిగొట్కూరు, డోన్ నియోజకవర్గాల పరిధిలో మొదటి విడత ప్రకారం.. దీర్ఘకాలిక జబ్బులతో పింఛన్ పొందుతున్న 873 మందిని పరిశీలించాల్సి ఉంది. ఈ పరిశీలన ప్రక్రియ డీఆర్‌డీఏ, వైద్య ఆరోగ్యశాఖ, జిల్లా పంచాయతీశాఖ సమన్వయంతో జిల్లా వ్యాప్తంగా జరగనుంది.

మూడు బృందాలు.. మూడు ప్రాంతాల్లో వైద్య పరీక్షలు

ప్రభుత్వ ఆఅదేశాలు మేరకు.. దీర్ఘకాలిక జబ్బులతో రూ. 15వేలు పింఛన్ పొందుతున్న పింఛనుదారులను పరీక్షలు చేసి అనర్హులను గుర్తించడానికి కలెక్టర్ రాజకుమారి తగిన విధంగా ప్రణాళికను సూచించారు. దీంతో డీఆర్‌డీఏ పీడీ నేతృత్వంలో సోమవారం నంద్యాల డివిజన్ పరిధిలో ఉయ్యాలవాడ, దొర్నిపాడు, ఆత్మకూరు డివిజన్ పరిధిలోని ఆత్మకూరు అర్బన్, రూరల్, డోన్ డివిజన్ పరిధిలో ప్యాపిలిలో సదరు దీర్ఘకాలిక జబ్బుల కింద రూ. 15 వేలు పింఛన్ పొందుతున్న వారిని వారి ఇంటి వద్దకే వెళ్లి వైద్య బృందాలు వైద్య పరీక్షలు చేయడంతో పాటు పరిశీలన చేసి అనర్హుల జాబితాను అక్కడిక్కడే ఆన్‌లైన్‌లో నమోదు చేయనున్నారు. ఒక్కొక్క బృందంలో ఒక ఫిజీషియన్, ఒక ఆర్థోపెడిక్ వైద్యుడితో స్థానిక పీహెచ్‌సీ వైద్యులు, డిజిటల్ అసిస్టెంట్ తదితర సిబ్బంది ఉంటారు. ఈ విధంగా జిల్లా అధికార యంత్రాంగం ఇప్పటికే మూడు బృందాలను ఏర్పాటు చేసి మూడు డివిజన్‌లోని మూడు ప్రాంతాల్లో నేడు దీర్ఘకాలిక జబ్బులు కలిగిన పింఛనుదారులను పరిశీలన చేయనున్నారు. మిగిలిన ప్రాంతాల్లో కూడా విడతల వారిగా నెల రోజుల పాటు ఈ ప్రక్రియ చేపట్టనున్నారు.

జిల్లాలో వివిధ కేటగిరీల కింద 2,16,111 మంది రూ.4వేలు, రూ. 6వేలు రూ.10 వేలు, రూ. 15 వేలు ప్రకారం ప్రతి నెలా కూటమి ప్రభుత్వం పింఛన్ అందిస్తోంది. అయితే ఇందులో ప్రభుత్వం మొదటి విడత కింద రూ.15 వేలు పింఛన్ పొందుతున్న వారిలో అనర్హులను గుర్తించనున్నారు. వైసీపీ

అక్రమ పింఛన్‌దారుల్లో వణుకు

హయాంలో ఎలాంటి అర్హత లేకపోయినా కొందరు సదరం సర్టిఫికెట్లు పొంది పింఛన్ అందుకుంటున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. తమ పింఛన్ ఉంటుందో.. ఊడుతుందో..? అని పింఛన్‌దారులకు వణుకు మొదులైంది. అక్రమంగా పింఛన్ పొందుతున్నట్లు ఈ పరిశీలన రుజువైతే.. వారికి సదరం సర్టిఫికెట్లు మంజూరు చేసిన వైద్యులపై ఎలాంటి చర్యలు ఉంటాయోనని అటు వైద్య వర్గాల్లోనూ అలజడి మొదలైంది.

శ్రీమఠంలో భక్తుల రద్దీ



భక్తులతో కిటకిటలాడుతున్న మంత్రాలయం మంతం ప్రాంగణం

.మంత్రాలయం, జనవరి 5(ఆంధ్రజ్యోతి): మంత్రాలయం రాఘవేంద్ర స్వామి దర్శనార్థం భక్తులు పోటెత్తారు. ఆదివారం సెలవు దినం కావటంతో దక్షణాది రాష్ట్రాల నుంచి వేలాది మంది భక్తులు తరలివచ్చారు. దీంతో మఠం ప్రాంగాణం భక్తులతో కిక్కిరిసింది. అన్నపూర్ణ భోజనశాల, మహాముఖద్వారం, మధ్వమార్గ్ కారిడార్, ప్రధాన రహహదారులు, రాఘవేంద్ర సర్కిల్, నదితీరం భక్తులతో కోలాహలంగా మారింది. తుంగభద్ర నదిలో పుణ్యస్నానాలు ఆచరించి గ్రామదేవత మంచాలమ్మను దర్శించుకొని రాఘవేంద్ర స్వామి మూల బృందావనానికి ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. స్వామి వారి దర్శన క్యూలైన్లు, పరిమళ ప్రసాదం కేంద్రాలు భక్తులతో సందడిగా మారాయి.

ఏప్రిల్ 1 నుంచి కేంద్రీయ విద్యాలయం ప్రారంభం

డోన్ రూరల్, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): డోన్ పట్టణంలో ఏప్రిల్ 1వ తేదీ నుంచి కేంద్రీయ విద్యాలయం ప్రారంభం కానుంది. ఈ మేరకు కేంద్ర ప్రభుత్వం నుంచి కేంద్రీయ విద్యాలయం డిప్యూటీ కమిషనర్ మంజునాథ్ నంద్యాల జిల్లా కలెక్టర్‌కు ఉత్తర్వుల ద్వారా తెలియజేశారు. అలాగే డోన్‌లో కేంద్రీయ విద్యాలయం కోసం భవనాలు సిద్ధం చేసుకోవాలని ఈ సందర్భంగా మానవ వనరుల శాఖ ఆదేశించింది. డోన్ ప్రభుత్వ ఐటీఐ ప్రాంగణంలో ఉన్న నిర్మించిన నూతన భవనాన్ని కేంద్రీయ విద్యాలయం కోసం పరిశీలిస్తున్నారు. కేంద్ర ప్రభుత్వం నుంచి భవనాల పరిశీలనకు ప్రత్యేక బృందం రానుంది. డోన్‌లో కేంద్రీయ విద్యాలయం ఏప్రిల్ 1 నుంచి ప్రారంభం కానుండటంపై ప్రజల్లో హర్షం వ్యక్తమవుతోంది.




మోగిన శంఖం



కదంతొక్కిన హైందవ సోదరులు.. కాషాయమయమైన కేసరపల్లి

భారతీయ సంస్కృతీ, సంప్రదాయం, సనాతన ధర్మం, ఆధ్యాత్మికతను భవిష్యత్ తరాలకు చాటిచెప్పే ఉద్దేశంతో విశ్వ హిందూ పరిషత్ ఆధ్వర్యంలో కృష్ణాజిల్లాలోని గన్నవరం మండలం కేసరపల్లిలో ఆదివారం హైందవ శంఖారావం భారీ బహిరంగ సభ నిర్వహించారు. రాష్ట్ర నలుమూలల నుంచి హిందువులు పెద్ద ఎత్తున తరలి రావడంతో సభా ప్రాంగణం కిక్కిరిసిపోయింది. దేశవ్యాప్తంగా కీర్తి గడించిన ఎందరో హైందవ నేతలు తమ ప్రసంగాల్లో హిందూధర్మం గొప్పతనాన్ని చాటిచెప్పారు. వివిధ ప్రాంతాల నుంచి హైందవ సోదరులు ర్యాలీలుగా తరలివచ్చారు. - విజయవాడ, ఆంధ్రజ్యోతి


సభా ప్రాంగణానికి వెళ్తున్న హిందువులు




సభలో ప్రసంగిస్తున్న గణపతి సచ్చిదానంద స్వామి, గోవింద్ దేవ్ గిరిజి మహరాజ్, స్వామి కమలానంద, స్వామి వరదానంద


హిందూ సోదరులతో కిక్కిరిసిన కేసరపల్లిలోని సభా ప్రాంగణం

రంగవల్లుల జాతర

- పోటీపోటీగా సాగిన ముత్యాల ముగ్గుల పోటీలు
- భారీగా తరలివచ్చిన నారీలోకం


స్పాన్సర్స్ కంపెనీల లోగో ముగ్గులను పరిశీలిస్తున్న అతిథులు


కర్నూలులో ముగ్గులు వేస్తున్న మహిళలు

కర్నూలు కల్చరల్, జనవరి 5(ఆంధ్రజ్యోతి): ఆంధ్రజ్యోతి- ఏబీఎన్ నిర్వహిస్తున్న సంతూర్ ముత్యాల ముగ్గుల పోటీలు... గార్డెనింగ్ పార్టనర్ క్రాఫ్టవారి పర్‌ఫెక్ట్.. ఫ్యాషన్ పార్టనర్ డిగ్‌సెల్ వారి సెల్సియా (ట్రెండీ మహిళల ఇన్నర్‌వేర్) ఆధ్వర్యంలో కర్నూలు నగరంలో ముగ్గుల పోటీల నిర్వహించారు. స్థానిక స్పాన్సర్లుగా టీజీవీ గ్రూప్ ఆఫ్ కంపెనీస్ చైర్మన్, రాజ్యసభ మాజీ సభ్యులు టీజీ వెంకటేశ్, ఆయన తనయుడు, రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్ సహకారంతో, మాంటిస్సోరి విద్యాసంస్థల డైరెక్టర్ కేఎస్‌వీ రాజశేఖర్ సౌజన్యంతో ఆదివారం ఉదయం నగరంలోని ఎ.క్యాంపు మాంటిస్సోరి హైస్కూల్ క్రీడా మైదానంలో ఏర్పాటు చేసిన ముగ్గుల పోటీలకు అనూహ్య స్పందన లభించింది. 307 మంది మహిళలు తీర్చిదిద్దిన ముగ్గులన్నీ ఇలను ముద్దాడుతున్న హరివిల్లుగా రూపుదిద్దుకుంది. తెల్లటి ముగ్గులు మధ్య మెరిసే గొబ్బెమ్మలు, వాటికి అలంకరించిన బంతిపూల సోయగాలు, గాలిపటాల రెపరెపలు, పల్లెపడుచుల ఆటలు, హరిదాసులు, గంగిరెద్దుల ఆటగాళ్ల, సంక్రాంతి పొంగళ్లను రంగవల్లుల మధ్యే వీక్షించేలా చేశారు.

సంప్రదాయంలో ముగ్గులు ఒక భాగం

ముగ్గులు మన సంప్రదాయంలో ఒక భాగమని, సంక్రాంతి పండుగ వేళ ఈ ముగ్గుల పోటీలు నిర్వహించడం మంచి సందర్భం అని రాజ్యసభ మాజీ సభ్యుడు టీజీ వెంకటేశ్ అన్నారు. ముగ్గుల పోటీల విజేతలకు బహుమతుల ప్రదానోత్సవ సభకు ఆయన ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా ఆయన మహిళలు వేసిన ముగ్గులను పరిశీలించి, ప్రశంసించారు. అనంతరం మాట్లాడుతూ అటు ప్రజా సమస్యలతో పాటు ప్రజల్లో భాగస్వామ్యం అయ్యేలా ఆంధ్రజ్యోతి-ఏబీఎన్ ఏటా ముగ్గుల పోటీలు నిర్వహిస్తూ, రాష్ట్రస్థాయిలో మహిళలను ప్రోత్సహించడం ప్రశంసనీమని అన్నారు. పోటీల్లో గెలుపు ఓటముల కన్నా, మహిళలను పోటీల్లో భాగస్వామ్యం అవడం సంతోషదాయకమని అన్నారు.

- రాజ్యసభ మాజీ సభ్యుడు టీజీ వెంకటేశ్

'మహిళలను ప్రోత్సహించడం అభినందనీయం'

ఆంధ్రజ్యోతి-ఏబీఎన్ ముగ్గుల పోటీలు నిర్వహించి మహిళలను ప్రోత్సహించడం అభినందనీయమని అతిథి పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత అన్నారు. ఆమె మాట్లాడుతూ మనకు ఎన్నో పండుగులు ఉన్నా సంక్రాంతి పెద్ద పండుగ అని, మూడురోజుల పాటూ జరిగే ఈ వేడుకలో ముగ్గులకు ఒక ప్రత్యేకత ఉంటుందని అన్నారు. ఒక పండుగ వాతావరణంలో మహిళలు పెద్ద సంఖ్యలో ముగ్గుల పోటీల్లో పాల్గొనడం సంతోషంగా ఉందని అన్నారు. డీఆర్వో వెంకటనారాయణమ్మ మాట్లాడుతూ మహిళలు వేసిన ముగ్గులన్నీ ఎంతో బావున్నాయని, అయితే బహుమతులు తమకు రాలేదన్న భావన కన్నా, పోటీల్లో పాల్గొన్నామనే సంతృప్తి ముఖ్యమని అన్నారు. సమాచార శాఖ ఉప సంచాలకులు జయమ్మ మాట్లాడుతూ సంస్కృతి సంప్రదాయాలను గౌరవించే విధంగా మహిళలకు ఆంధ్రజ్యోతి యాజమాన్యం ముగ్గుల పోటీలు ఏటా నిర్వహించడం ఎంతో స్ఫూర్తిదాయకమని అన్నారు. ముగ్గులు వేయడం ఒక కళఅని, అందులో సృజనాత్మకతతో వేయడం మహిళల ప్రత్యేకత అని అన్నారు. ఆంధ్రజ్యోతి-ఏబీఎన్ బ్రాంచ్ మేనేజర్ ఆకుల లక్ష్మణ్ మాట్లాడుతూ ఏటా నిర్వహిస్తున్న ఈ పోటీలకు మహిళలను నుంచీ గొప్ప ఆదరణ రావడం సంతోషమని, జిల్లా స్థాయిలో విజేతలు రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొనాలని సూచించారు. కార్యక్రమంలో విశ్రాంత డీఎస్పీ మహబూబ్ బాషా, ఆంధ్రజ్యోతి ఎడిషన్ ఇన్‌చార్జి చల్లా నవీన్‌కుమార్ నాయుడు, బ్యూరో ఇన్‌చార్జి గోరంట్ల కొండప్ప, ఏబీఎన్ ప్రతినిధి సుంకన్న, నంద్యాల స్టాఫ్ రిపోర్టర్ గోపాలకృష్ణ, న్యాయ నిర్ణేతలు డాక్టర్ దండెబోయిన పార్వతీదేవి, టీవీ పద్మలత, సర్దార్ రాముడు తదితరులు పాల్గొన్నారు.

కర్నూలులో విజేతలు వీరే...

కర్నూలులో ముగ్గుల పోటీల్లో ప్రథమ నగదు బహుమతి రూ.6 వేలు ఆర్. గౌతమి, ద్వితీయ నగదు బహుమతి రూ.4 వేలు శరణ్య, తృతీయ నగదు బహుమతి రూ.3 వేలు ఎం. రేణుక గెలుపొందారు. వీరికి ముఖ్య అతిథులు టీజీ వెంకటేశ్, గౌరు చరితతోపాటూ ఆహ్వాన అతిథులు బహుమతులు ప్రదానం చేశారు. అలాగే ఉత్తమంగా నిలిచిన 7గురు తెలుగు మహేశ్వరి, చంద్రకళ, వాణిబాయి, వి. సుజాత, ఎం. శైలజ, పి. రాజేశ్వరి, శ్రీలక్ష్మికి కన్సొలేషన్ బహుమతులు అందజేశారు.

ఆదోనిలో..

ఆదోని/ఆదోని టౌన్/ఆదోని అగ్రికల్చర్(ఆంధ్రజ్యోతి) :కర్నూలు జిల్లా ఆదోని పట్టణంలోని మిల్టన్ గ్రామర్ ఇంగ్లీష్ మీడియం హైస్కూల్ మైదానంలో ఆదివారం ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఈ పోటీలకు ఎస్‌డీబీఎల్ పత్తి పరిశ్రమ అధినేత, ప్రముఖ్య పారిశ్రామికవేత్త బత్తిన లక్ష్మీనారాయణ, బత్తిన హనుమంతమ్మ కుటుంబ సభ్యులు స్పాన్సర్లుగా వ్యవహరించారు. ముఖ్య అతిథిగా ఆదోని డీఎస్పీ సోమన్న, అతిథులుగా బత్తిన లక్ష్మీనారాయణ, బత్తిన హనుమంతమ్మ, బత్తిన కుబేర్‌నాథ్, బత్తిన మల్లేశ్, మిల్టన్ గ్రామర్ హైస్కూల్ అధినేత రమేష్‌బాబు హాజరయ్యారు. ఈ పోటీల్లో 66 మంది మహిళలు, విద్యార్థినులు పోటీల్లో పాల్గొన్నారు. న్యాయనిర్ణేతలుగా న్యాయవాది లలితా జితేంద్ర, జయప్రద, పరిమళ వ్యవహరించారు. మొదటి బహుమతి డి.గౌతమి రూ.6 వేలు, రెండో బహుమతి ఎ.రేణుక రూ.4 వేలు, మూడో బహుమతి బి.శిరీష రూ.3 వేలు గెలుచుకున్నారు. వారికి ముఖ్య అతిథి, అతిథులు బహుమతులు ప్రదానం చేశారు. ఏబీఎన్ ఆంధ్రజ్యోతి సిబ్బంది పాల్గొన్నారు.


కర్నూలులో..


ఆదోనిలో ముగ్గును పరిశీలిస్తున్న న్యాయ నిర్ణేతలు

అక్రమ రిజిస్ట్రేషన్‌పై తనిఖీ


మాట్లాడుతున్న జిల్లా రిజిస్ట్రార్ చెన్నకేశవరెడ్డి

ఆదోని, జనవరి 5 (ఆంధ్రజ్యోతి) : ఆదోని పట్టణంలోని మండగిరి గ్రామ పంచాయతీ పరిధిలోని సర్వే నెంబరు 321-ఏలోని భూమిని అక్రమంగా రిజిస్ట్రేషన్ చేయడంపై జిల్లా రిజిస్ట్రార్ చెన్నకేశవరెడ్డి ఆదివారం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి వస్తున్నట్లు తెలుసుకున్న స్థానిక రిపోర్టర్లు ఫొటోలు తీస్తుండగా తీయరాదని హుకుం జారీ చేశారు. నకిలీ పత్రాలతో రిజిస్ట్రేషన్ చేసిన వ్యక్తిని వెనుకేసుకొస్తున్నారా అనడంతో తనిఖీలకు వచ్చామని సమాధానం ఇచ్చారు. అనంతరం కార్యాలయంలోని రికార్డులు, కంప్యూటర్‌లోని ఫైల్స్‌ను పరిశీలించారు. రూ.కోట్ల విలువ చేసే 6.51 ఎకరాల భూమిని అసలు యజమానిని గుర్తించకుండా నకిలీ ఆధార్ కార్డు, డెత్ సర్టిఫికెట్ సృష్టించినా గుర్తించకపోవడంపై సబ్ రిజిస్ట్రార్‌పై ఆగ్రహం వ్యక్తం చేసినట్లు తెలిసింది. దీనిపై జిల్లా రిజిస్ట్రార్ చెన్న కేశవరెడ్డిని వివరణ కోరగా అక్రమ రిజిస్ట్రేషన్ వ్యవహారంపై రికార్డులను తనిఖీ చేశామని తెలిపారు. పూర్తి స్థాయిలో విచారణ చేపడుతున్నామన్నారు. నివేదికను అధికారులకు సమర్పిస్తామని తెలిపారు. బాధితుడికి న్యాయం చేస్తామని అన్నారు.

స్టేట్ కేన్సర్ హాస్పిటల్ సీఎస్ఆర్ఎంవోగా హేమనళిని బాధ్యతలు


కేన్సర్ హాస్పిటల్ డైరెక్టర్ డాక్టర్ కృష్ణమోహన్ నుంచి ఉత్తర్వులు అందుకుంటున్న సీఎస్ఆర్ఎంవో డాక్టర్ హేమనళిని

కర్నూలు హాస్పిటల్, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోనే మొట్టమొదటి స్టేట్ కేన్సర్ హాస్పిటల్ సివిల్ సర్జన్ ఆర్ఎంవో డా.బి.హేమనళిని బాధ్యతలు చేపట్టారు. కర్నూలు జీజీహెచ్‌లో డిప్యూటీ సీఎస్ఆర్ఎంవోగా పని చేసిన డా.బి.హేమనళిని సివిల్ సర్జన్‌గా పదోన్నతి పొంది స్టేట్ కేన్సర్ హాస్పిటల్ సీఎస్ఆర్ఎంవో గా హాస్పిటల్ డైరెక్టర్ డా.కృష్ణప్రకాష్ సమక్షంలో విధుల్లో చేరారు. కర్నూలు జీజీహెచ్ నుంచి రిలీవ్ అయి స్టేట్ కేన్సర్ హాస్పిటల్ సివిల్ సర్జన్ ఆర్ఎంవోగా విధుల్లో చేరారు. ఈ సందర్భంగా కొత్త సీఎస్ఆర్ఎంవోకు స్టేట్ క్యాన్సర్ హాస్పిటల్ డైరెక్టర్ డా.కృష్ణ ప్రకాష్, అసోసియేట్ ప్రొఫెసర్ డా.ఉమామహేశ్వరరెడ్డి, అసిస్టెంట్ ప్రొఫెసర్లు, గ్రేడ్-2 నర్సింగ్ సూపరింటెండెంట్లు జి.అనుసూయ, కె.రాజ్యలక్ష్మీ, అభినందనలు తెలిపారు. రోగులకు మెరుగైన సేవలు అందేలా వైద్యుల సహకారంతో కృషి చేస్తానని కొత్త సీఎస్ఆర్ఎంవో డా.హేమనళిని తెలిపారు.

నేడు ఎడ్యుకేషనల్ రీసెర్చ్ ప్రోగ్రాం

కర్నూలు ఎడ్యుకేషన్, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): సర్వశిక్ష అభియాన్ ఆధ్వర్యంలో సోమవారం ఉదయం 10 గంటలకు స్థానిక కింగ్ మార్కెట్ బాలికల ఉన్నత పాఠశాలలో ఎడ్యుకేషనల్ రీసెర్చ్ అండ్ ట్రైనింగ్ ప్రోగ్రాం జరుగనున్నట్లు డీఈవో శామ్యూల్ పాల్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ శిక్షణ కార్యక్రమానికి ఎంపిక చేయబడిన 40 పాఠశాలలకు సంబంధించిన ఉపాధ్యాయులు హాజరవుతున్నారని చెప్పారు. ఈ కార్యక్రమం ఈఎండీపీ సమన్వయకర్త గోపాల్ పర్యవేక్షణలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జిల్లా సైన్స్ అధికారి రంగమ్మ విద్యార్థులకు ఎంటర్ ప్రెన్యూర్ మైండ్ సెట్ డెవలప్మెంట్ ప్రోగ్రాం కార్యక్రమం సంబంధించిన వివిధ సూచనలు, సలహాలు ఉపాధ్యాయులకు తెలియజేస్తారని చెప్పారు.

కబడ్డీ ఫైనల్‌లో కర్నూలు, వైజాగ్ జట్లు


క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న కేఈ ప్రభాకర్

కర్నూలు స్పోర్ట్స్, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): మూల్పూరి రంగారావు స్మారక రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలకు కర్నూలు నగర శివారులోని డీడీపాడు కేఈ ప్రభాకర్ ఫాంహౌస్ వేదికైంది. కర్నూలు బాలబాలికలు నెల్లూరు, అనంతపురం జట్లు హోరాహోరీగా తలపడ్డాయి. కర్నూలు బాలబాలికలు నెల్లూరు, అనంతపురం జట్లపై హోరాహోరీగా తలపడ్డాయి. ఫైనల్‌కు ప్రవేశించాయి. బాలుర-1 సెమీఫైనల్ కర్నూలు నెల్లూరుపై 35-25 విశాఖపట్నం, చిత్తూరుపై 32-28 పాయింట్లతో నెగ్గి ఫైనల్‌కు ప్రవేశించింది. బాలికల విభాగంలో కర్నూలు, చిత్తూరు పై డ్రా అయింది. అదనపు సమయంలో 7-3 పాయింట్లతో కర్నూలు నెగ్గింది. అలాగే విశాఖపట్నం బాలికలు చిత్తూరుపై నెగ్గి ఫైనల్‌కు ప్రవేశించాయి. అంతకుముందు టోర్నమెంటు అధ్యక్షులు మాజీ ఎమ్మెల్సీ కేఈ ప్రభాకర్, కేవీ సుబ్బారెడ్డి, మల్లికార్జున రెడ్డి కర్నూలు, అంతపురం జట్లు (బాలికలు)ను పరిచయం చేసుకున్నారు. ఫైనల్‌లో కర్నూలు, విశాఖ బాలురు, కర్నూలు, విశాఖపట్నం బాలికలు ఆడాల్సి ఉంది.

బీచ్ హ్యాండ్‌బాల్ పోటీల్లో రెండో స్థానంలో కర్నూలు జట్టు


ద్వితీయ స్థానంలో నిలిచిన కర్నూలు జట్టుకు షీల్డ్ అందజేస్తున్న నిర్వాహకులు

అచ్యుతాపురం (అనకాపల్లి జిల్లా), జనవరి 5 (ఆంధ్ర జ్యోతి): అచ్యుతాపురం మండలం పూడిమడకలో నిర్వహించిన రాష్ట్రస్థాయి బీచ్ హ్యాండ్‌బాల్ పోటీల్లో విశాఖ జిల్లా జట్టు ప్రథమ స్థానంలో నిలిచింది. రెండు రోజులపాటు నిర్వహించిన ఈ పోటీల్లో రాష్ట్రంలోని అన్ని ఉమ్మడి జిల్లాల నుంచి క్రీడా జట్లు పాల్గొన్నాయి. ఆదివారం జరిగిన తుది పోటీల్లో కర్నూలుపై విశాఖ జట్టు గెలుపొంది ప్రథమ బహుమతిని కైవసం చేసుకుంది. రెండో స్థానంలో కర్నూలు, మూడో స్థానంలో ప్రకాశం జిల్లా జట్లు నిలిచాయి. విజేత జట్లకు జనసేన పార్టీ ఉత్తరాంధ్ర వ్యవహారాల ఇన్‌చార్జి సుందరపు సతీశ్ కుమార్ షీల్డ్‌తోపాటు క్రీడాకారులకు వ్యక్తిగత మెడల్స్ పంపిణీ చేశారు. ఎలమంచిలి జనసేన పార్టీ ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ సొంత నిధులతో రాష్ట్రస్థాయి బీచ్ హ్యాండ్‌బాల్ పోటీలు నిర్వహించారు.

ముంగిట వేసే ముగ్గు లక్ష్మీదేవికి ఆహ్వానం

- సంప్రదాయం ఉట్టిపడేలా ముగ్గుల పోటీలు నిర్వహించారు
- స్త్రీ, శిశు సంక్షేమశాఖ పీడీ లీలావతి
- ముగ్గుల పోటీలు నిర్వహించడం అభినందనీయం
- డీఆర్‌డీఏ-వెలుగు ఏరియా కో ఆర్డినేటర్ నాగేంద్ర ప్రసాద్



మాట్లాడుతున్న లీలావతి, నాగేంద్రప్రసాద్

నంద్యాల కల్చరల్, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): ముగ్గు మహిళల్లో సృజనాత్మక శక్తిని తెలియజేస్తుంది, ముంగిట వేసే ముగ్గు లక్ష్మీదేవికి ఆహ్వానం పలుకుతుందని, ప్రకృతి సహజీవనాన్నీ సూచిస్తుందని నంద్యాల జిల్లా స్త్రీ, శిశు సంక్షేమ శాఖ (ఐసీడీఎస్) ప్రాజెక్టు డైరెక్టర్ (పీడీ) లీలావతి అన్నారు. నంద్యాల టెక్కె మార్కెట్ యార్డు ఆవరణలో ఏబీఎన్-ఆంధ్రజ్యోతి ఆధ్వర్యంలో సంతూర్ ముత్యాల ముగ్గుల పోటీకి పెద్దసంఖ్యలో హాజరైన మహిళలు కనువిందు చేసే ముగ్గులతో సంక్రాంతి పర్వదినానికి ముందే మహ్వానం పలికారు. విజేతలకు బహుమతులు ప్రదానోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన లీలావతి మాట్లాడుతూ మహిళలు వేసే ముగ్గులో సైన్సు, ఆధ్యాత్మికత ఉందాన్నరు. ముగ్గు వేస్తున్న సమయంలో మనిషిలో నాడి వ్యవస్థ యాక్టివ్ అవుతుందని, తద్వారా ఆరోగ్యం మెరుగు పడుతుందని, ప్రతి రోజు ముగ్గులు వేయడం ఎంతో మంచిదిని అన్నారు. ఆవుపేడతో కల్లాపు చల్లి, ముగ్గులు వేయడం, గడపకు పసుపు రాయడం వల్ల బయట నుంచి హానికరమైన క్రిములు ఇంట్లోకి రావడని వివరించారు. ఐసీడీఎస్ ద్వారా మహిళలకు అందింస్తున్న సేవలు, మహిళలకు ఉన్న రక్షణ చట్టాలు గురించి వివరించారు. బాల్య వివాహాలు నివారించడంతో మహిళల పాత్ర ఎంతో కీలకంగా ఉండాలన్నారు. డీఆర్ డీఏ-వెలుగు ఏరియా కో-ఆర్డినేటర్ నాగేంద్రప్రసాద్ మాట్లాడుతూ ఆంధ్రజ్యోతి రెండు దశాబ్దాలకు పైగా సంక్రాంతి పర్వదినం పురస్కరించుకొని ముగ్గుల పోటీలు నిర్వహించడం అభినం దనీయం అన్నారు. మహిళల్లో దాగి ఉన్న కళను ఈ పోటీలు ద్వారా ప్రపంచానికి చాటి చెబుతున్నారన్నారు. భారతదేశంలో ముగ్గులు వేయడం ఒక ప్రాచీనకళ అన్నారు. ముగ్గు ద్వారానే చిత్రలేఖనం, డిజైనింగ్ వంటివి అనేకం వచ్చాయన్నారు. సంక్రాంతి గొప్పతనాన్ని మన పిల్లలకు వివరించి భారత సంస్కృతిని కాపాడుకోవాల్సిన కర్తవ్యం మనందరిపై ఉందన్నారు. పిల్లలకు మ నం ఇచ్చే ఆస్తి చదువు.. ఆ చదువే వారిని ఉన్నతి స్థితిలో చేరు స్తుందన్నారు. ఈ పోటీల్లో నంద్యాల, పాణ్యం, బనగానపల్లె నుంచి మహిళలు పాల్గొన్నారు.

కమ్ముకున్న పొగమంచు



మహానంది మండలంలోని బుక్కాపురం, అల్లీనగరం సమీపంలోని ప్రధాన రహదారిని ఆదివారం తెల్లవారిన తర్వాత ఒక్కసారిగా పొగమంచు కమ్మేసింది. ఉదయం 9 గంటలు దాటినా తగ్గలేదు. ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించకుండా పోవడంతో వాహనదారులు నెమ్మదిగా వెళ్లక తప్పలేదు.

- మహానంది, ఆంధ్రజ్యోతి

11 నుంచి జిల్లా స్థాయి కబడ్డీ పోటీలు

గడివేముల, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మంచాలకట్ట గ్రామంలో దివ్య బాల యేసు పండుగ సందర్భంగా 11, 12 తేదీల్లో జిల్లాస్థాయి కబడ్డీ పోటీలు నిర్వహిస్తున్నట్లు రెవరెండ్ ఫాదర్ తోట జోసఫ్ తెలిపారు. ఈ కబడ్డీ పోటీల్లో మొదటి బహుమతి రూ.25 వేలు, రెండో బహుమతి రూ.20 వేలు, మూడో బహుమతి రూ.15 వేలు, నాలుగో బహుమతి రూ.10 వేలు, ఐదో బహుమతి రూ.5 వేలు అందిస్తున్నామని అన్నారు. కబడ్డీ పోటీల్లో పాల్గొనే వారు 8978578533, 9949861921, 9573754480లను సంప్రదించాలని సూచించారు.

సత్ప్రవర్తనతో జీవించాలి

నంద్యాల క్రైం, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో నేర నియంత్రణ, శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా పోలీస్ అధికారులు ఆయా పోలీస్ స్టేషన్ల పరిధిలోని రౌడీషీటర్లు, నేరచరిత్రగలవారు, చెడునడత కలిగిన వ్యక్తులు సత్ప్రవర్తనతో జీవించాలని ఆదివారం కౌన్సెలింగ్ ఇచ్చారు. ప్రస్తుతం వారు జీవిస్తున్న విధానం, జీవనోపాధికి చేస్తున్న వృత్తులపై ఆరా తీశారు. అసాంఘిక, చట్టవ్యతిరేక కార్యకలాపాల్లో పాల్గొనరాదని హెచ్చరించారు.

అగ్నిప్రమాదంలో మూడు గుడిసెలు దగ్ధం



లింగాలలో మంటలను ఆర్పుతున్న గ్రామస్థులు

పాములపాడు జనవరి 5 (ఆంధ్రజ్యోతి): పాములపాడు మండలం లింగాల గ్రామంలో ఆదివారం జరిగిన అగ్ని ప్రమాదంలో మూడు గుడిసెలు అగ్నికి ఆహుతయ్యాయి. లింగాల గ్రామంలోని ఎస్సీ కాలనీలో మాదిగ స్వాములు, నగేష్, నాగన్నల గుడిసెలకు ప్రమాదవశాత్తు నిప్పంటుకుని మంటలు చెలరేగి ఈ మూడు గుడిసెలు కాలిపోయాయి. కాగా ఆ గుడిసెలకు నిప్పంటుకున్న సమయంలో ఆ ఇళ్లలో పొలం పనుల నిమిత్తం వెళ్లడంతో ఇళ్లలో ఎవరూ లేక పోవడంతో ఆ మంటల్లో ఇంట్లోని సామాన్లు, నిత్యావసర వస్తువులు, అన్ని అగ్నికి ఆహుతయ్యాయి. ఈ మంటలను గమనించిన స్థానికులు, రైతులు మంటలను అదుపు చేశారు. దీంతో చుట్టు పక్కల ఉన్న గడ్డివాములకు పెను ప్రమాదం తప్పినట్లయింది. దాదాపు 3 లక్షల మేర ఆస్తి నష్టం సంభవించిందని, ప్రభుత్వం ఆర్థిక సహాయం అందించి ఆదుకోవాలని బాధిత కుటుంబ సభ్యులు కోరారు.

గువ్వలకుంట్లకు బస్సు సౌకర్యం కల్పించాలి

కొత్తపల్లి, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): కొత్తపల్లి మండలంలోని గువ్వలకుంట్ల గ్రామానికి ఆత్మకూరు నుంచి ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పించాలని కొత్తపల్లి మండల మాజీ మండల ఉపాధ్యక్షులు, టీడీపీ సీనియర్ నాయకుడు పోత సహదేవుడు ఆత్మకూరు ఆర్టీసీ అధికారులను కోరారు. ఆదివారం వారు మాట్లాడుతూ గువ్వలకుంట్ల మేజర్ గ్రామ పంచాయతీ అయినప్పటికీ ఆర్టీసీ అధికారులు ఐదేళ్లుగా బస్సు నడపడం లేదని అన్నారు. ఈ విషయంపై మండల సర్వసభ్య సమావేశంలో స్థానిక ప్రజా ప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లినా స్పందన లేదన్నారు. గువ్వలకుంట్ల గ్రామ పంచాయతీకి బండినాయునిపాలెం, పాలెంచెరువు మజరా గ్రామాలు ఉన్నాయన్నారు. సుమారు మూడు వేల జనాభా ఉన్న ఈ గ్రామానికి బస్సు సౌకర్యం ఎందుకు కల్పించడం లేదో అధికారులకు తెలియాలన్నారు. బస్సు సౌకర్యం లేకపోవడంతో గ్రామస్థులు ఆటోలు, ద్విచక్రవాహనాలపై వెళ్తూ తరుచూ ప్రమాదాలకు గురవుతున్నారని చెప్పారు. ఎమ్మెల్యే జయసూర్య ఆర్టీసీ అధికారులతో మాట్లాడి బస్సు సౌకర్యం కల్పించాలని కోరారు.

సంస్మరణ సభను జయప్రదం చేయండి



మాట్లాడుతున్న ఏపీటీఎఫ్ నంద్యాల జిల్లా అధ్యక్షుడు మాధవస్వామి

ఆత్మకూరురూరల్, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): నంద్యాలలోని రామకృష్ణ డిగ్రీ కళాశాలలో 11న నిర్వహించే ఉపాధ్యాయ ఉద్యమ నేత మార్పు బాలకృష్ణమ్మ 12వ రాష్ట్ర సంస్మరణ సభను విజయవంతం చేయాలని ఏపీటీఎఫ్ నంద్యాల జిల్లా అధ్యక్షుడు మాధవస్వామి, గౌరవాధ్యక్షులు శంకర్ కోరారు. ఆదివారం పట్టణంలోని స్థానిక ఏపీటీఎఫ్ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. ఈ సభకు జాతీయ, రాష్ట్ర నాయకులు, మేధావులు పాల్గొంటున్నారని, ఉపాధ్యాయులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని అన్నారు. కార్యక్రమంలో ఏపీటీఎఫ్ నాయకులు అబ్దుల్ వహీద్, దాసు,సుబ్రహ్మణ్యం,భాస్కర్, రామాంజనేయులు, అంబయ్య, నాయక్, విధుభూషన్ తదితరులు పాల్గొన్నారు.

హైందవ శంఖారావానికి బస్సు ఏర్పాటు

నంద్యాల కల్చరల్, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): నంద్యాల జిల్లా ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు భవనాశి నాగమహేష్ తన సొంత నిధులతో చలో విజయవాడ హైందవ శంఖారావానికి శనివారం బస్సు ఏర్పాటు చేశారు. సందర్భంగా ఆయన మాట్లాడుతూ హిందువులకు తన వంతు సహాయ సహకారాలు ఎల్లప్పుడూ ఉంటాయని పేర్కొన్నారు. హైందవ శంఖారావం జయప్రదం కావాలని హిందువులందరూ సంఘటితం కావాలని ఆకాంక్షించారు.

నాటుసారా స్థావరాలపై దాడులు



నాటుసారా బట్టీని ధ్వంసం చేస్తున్న ఎక్సైజ్ సిబ్బంది

ఆత్మకూరు రూరల్, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): ఆత్మకూరు మండలంలోని సిద్ధాపురం గ్రామ శివార్లలో నాటుసారా స్థావరాలపై దాడులు నిర్వహించినట్లు ఎక్సైజ్ సీఐ కిషోర్ కుమార్ ఆదివారం తెలిపారు. ఆవుల దొంగు రస్తా సమీపంలో ఓ నాటుసారా స్థావరాన్ని గుర్తించి బట్టి వద్ద ఉన్న 900 లీటర్ల బెల్లపు ఊటను, నాటుసారా తయారీ సామగ్రిని ధ్వంసం చేసినట్లు తెలిపారు ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. ఇదిలా ఉంటే గ్రామంలో ఎవరైనా అక్రమంగా నాటు సారా తయారీ, రవాణా, అమ్మకాలకు పాల్పడినా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. దాడుల్లో ఎక్సైజ్ ఎస్ఐలు వీరస్వామి, జగదీష్, ఎక్సైజ్ సిబ్బంది పాల్గొన్నారు.

రైతులకు ఇచ్చిన హామీని అమలు చేయాలి

● సీపీఐ(ఎంఎల్) లిబరేషన్ పార్టీ ఉమ్మడి జిల్లా నాయకుడు వెంకటేశ్వర్లు



మాట్లాడుతున్న వెంకటేశ్వర్లు

నందికొట్కూరు, జనవరి 5(ఆంధ్రజ్యోతి): అన్నదాత సుఖీభవ నిధులను రాష్ట్ర ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వానికి ముడి పెట్టకుండా తక్షణమే రూ.20 వేలు విడుల చేయాలని సీపీఐ ఎంఎల్ లిబరేషన్ జిల్లా నాయకుడు వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. ఆదివారం పట్టణంలోని కోటా వీధిలో ఉన్న సీపీఎంఎల్ లిబరేషన్ పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఖరీఫ్, రబీ సీజన్లు పూర్తవుతున్నా పెట్టుబడి సహాయం కింద రైతులకు రూ.20 వేల ఆర్థిక సహాయం చేయలేదన్నారు. కేంద్ర ప్రభుత్వం ఈ సారి రైతులకు రూ.6 వేల నుంచి రూ.10 వేలకు పెంచిందన్నారు. అయితే చంద్రబాబు నాయుడు ఇస్తామన్న మరో రూ.10 వేలు మొత్తం రూ.20 వేలు ఒకే సారి రైతుల ఖాతాలో వేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో రాబోయే కాలంలో రైతులే కూటమి ప్రభుత్వానికి బుద్ధి చెబుతారని ఆయన హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు సోమన్న, మహిళా సంఘం జిల్లా నాయకురాలు బీబీ, లక్ష్మీదేవి, కార్మిక సంఘం నాయకులు మస్తాన్‌వలి, ఆనంద్ కుమార్, వెంకటస్వామి, దుర్గయ్య పాల్గొన్నారు.

ప్రభుత్వాల మోస పూరిత విధానాలను వ్యతిరేకించాలి



మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు ఏసురత్నం

ఆత్మకూరురూరల్, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల మోస పూరిత విధానాలను వ్యతిరేకించాలని సీపీఎం పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఏసురత్నం,పట్టణ కార్యదర్శి రణధీర్ అన్నారు. ఆదివారం పట్టణంలోని సీపీఎం పట్టణ కమిటీ సమావేశాన్ని పట్టణ అధ్యక్షులు సురేంద్ర ఆధ్వర్యంలో ఆ పార్టీ కార్యాలయంలో నిర్వహించారు. వారు మాట్లాడుతూ..దేశంలో ఒకే దేశం.. ఒకే ఎన్నిక నినాదంతో జమిలి ఎన్నికలు తెచ్చారని, ఇది పూర్తిగా ప్రజాస్వామ్యాన్ని తుంగలో తొక్కడమేనని విమర్శించారు. రాష్ట్రంలో టీడీపీ జనసేన, బీజేపి కూటమి ప్రభుత్వాలు మోస పూరిత విధానాలను అవలంబిస్తూ..ప్రజలపై భారాలు మోపుతున్నాయన్నారు. సర్దుబాటు పేరుతో ప్రజలపై కరెంట్ ఛార్జీలు పెంచడం, నిత్యావసర వస్తువులైన వంట నూనెలు, కంది పప్పు, కూరగాయల ధరలు ఆకాశన్నంటుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలన్నీ అమలు చేయాలని డిమాండ్ చేశారు.ఈ సమావేశంలో సీపీఎం పట్టణ నాయకులు మంజుల,రామ్‌నాయక్, షేక్ ఇస్మాయిల్, వీరన్న, భాస్కర్ పాల్గొన్నారు.

తొలగిన ఇబ్బందులు



సమావేశంలో పాల్గొన్న బైటిపేట గ్రామస్తులు, స్మశానవాటిక నిర్వాహకులు

నంద్యాల కల్చరల్, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): నంద్యాల ఆర్టీసీ బస్టాండు సమీపంలో ఉన్న హిందూ శ్మశాన వాటికకు వైకుంఠ రథం వెళ్లేందుకు ఇబ్బందులు తొలగిపోయాయి. శ్మశానానికి వైకుంఠ రథం వెళ్లే మార్గంలో ఆటోలు, సైకిళ్లు, మంచాలు, బాత్రూంలు, వంట సామాన్లు మొదలగు అడ్డంకులు ఉన్నాయి. ఉదయం 6గంటల నుంచి సాయంత్రం 6గంటల వరకు బైటిపేట ప్రజలు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి సమస్యను పరిష్కరించుకున్నారు. కార్యక్రమంలో చిన్మయ స్కూల్ అధ్యక్షులు కొశెట్టి క్రిష్ణమూర్తి, శ్రీనివాసరావు, వెంకటేష్ బాబు, రామరాజశేఖర్, రామచంద్రమూర్తి, నాగేశ్వర్, బాబురావు, శేషయ్య, ఆంజనేయులు, లక్ష్మీనరసింహ, బైటిపేట మద్దయ్య, భీముడు, సుబ్బు, జానీ, నరసింహ, వన్‌టౌన్ ఎస్ఐ సురేష్ పాల్గొన్నారు.

పీరుసాహెబ్ పేటలో కార్డన్ సెర్చ్



గ్రామంలో కవాతు నిర్వహిస్తున్న పోలీసులు

మిడుతూరు, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పీరుసాహెబ్ పేట గ్రామంలో మిడుతూరు ఎస్ఐ ఓబులేసు, నందికొట్కూరు ఎస్ఐ చంద్రశేఖర్, బ్రాహ్మణ కొట్కూరు ఎస్ఐ తిరుపాలు పోలీసు సిబ్బందితో ఆదివారం కార్డన్ సెర్చ్ నిర్వహించారు. గ్రామంలో అనుమానాస్పద వ్యక్తుల నివాసాల్లో సోదాలు నిర్వహించారు. అనంతరం గ్రామ వీధుల్లో సిబ్బందితో కవాతు నిర్వహించారు. గ్రామంలో ప్రతి ఒక్కరూ శాంతి యుతంగా మెలగాలని, ఏవైనా సమస్యలు వుంటే అధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు.



ముగ్గుల పోటీలో పాల్గొన్న మహిళలకు బహుమతుల ప్రదానం

ముందస్తు సంక్రాంతి సంబరాలు

నంద్యాల కల్చరల్, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): నంద్యాల రమా సమేత సత్యనారాయణ స్వామి దేవస్థానంలో ఆలయ చైర్‌పర్సన్ శ్రీదేవి ఆధ్వర్యంలో ముందస్తు సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా ముగ్గుల పోటీలు, చిన్నపిల్లలకు రేగిపండ్లు, గాలిపటాలు ఎగురవేడం, భోగిమంటలు తదతర కార్యక్రమాలు జరిపారు.

శిథిలావస్థలో ఎంఆర్‌సీ భవనం



శిథిలావస్థకు చేరిన కొత్తపల్లి ఎంఆర్‌సీ భవనం

కొత్తపల్లి, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): కొత్తపల్లిలో ఎప్పుడో 40 ఏళ్ల క్రితం నిర్మించిన మండల రీసోర్స్ సెంటర్ (ఎంఆర్‌సీ) భవనం పూర్తిగా శిథిలావస్థకు గురై కూలేందుకు సిద్ధంగా ఉంది. ఈ భవనంలో ప్రభుత్వం మంజూరు చేసే పాఠ్యపుస్తకాలను అన్ని ప్రభుత్వ పాఠశాలలకు సరఫరా చేయాల్సి ఉంది. అంత వరకు ఈ భవనంలోనే పాఠ్యపుస్తకాలను భద్రపరిచేవారు. అయితే పైకప్పు పెచ్చులూడిపోతోంది. చిన్న పాటి వర్షానికే కారుతుండడంతో పాఠ్య పుస్తకాలు తడిసి ముద్దవుతున్నాయి. ఈ ఏడాది వర్షాకాలంలో ఇలాగే పాఠ్యపుస్తకాలు తడిసిపోతుండటంతో చేసేదేమి లేక మండల విద్యాశాఖ అధికారులు సమీపంలోని జిల్లా పరిషత్ పాఠశాలలో ఓ తరగతి గదిలో పుస్తకాలను భద్రపరిచి అక్కడి నుంచే అన్ని పాఠశాలలకు సరఫరా చేశారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఎంఆర్‌సీ పాత భవనం స్థానంలో నూతన భవనాన్ని నిర్మించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఈ విషయం పై ఎంఈవో-2 ఇనయతుల్లాను వివరణ కోరగా.. పలు పర్యాయాలు భవన స్థితిగతుల నుంచి ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లామని అయినా ఎటువంటి స్పందన లేదన్నారు.

జాతీయ స్థాయి విజేతలుగా నంద్యాల చిన్నారులు



విజేతలైన చిన్నారులకు మెడల్స్, సర్టిఫికెట్లు, అవార్డ్స్ అందజేసి అభినందిస్తున్న కోటేష్

నంద్యాల కల్చరల్, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): నెల్లూరులోని అమీర్ ఆర్ట్ అకాడమీ వారు డిసెంబరులో నిర్వహించిన బాలల జాతీయస్థాయి చిత్రకళా పోటీల్లో నంద్యాల కోటేష్ ఆర్ట్ అకాడమీ విద్యార్థులు అవార్డులు సాధించినట్లు నిర్వాహకులు కోటేష్ తెలిపారు. ఈ పోటీల్లో ఎనిమిది మంది చిన్నారుల అవార్డులు సాధించారన్నారు. సాయిహవీష్, సమిత, శ్రేష్ఠ, ఫర్హాన, నీతుకృష్ణ, శ్రీవేదగ్న, మేఘన, భానుతేజలు జాతీయస్థాయి చిత్ర కళాపోటీల్లో విజేతలుగా నిలిచారు. వీరందరికీ ఆదివారం కోటేష్ ఆర్ట్ అకాడమీలో నెల్లూరు ఆర్ట్ అకాడమీ వారు పంపిన అవార్డ్స్, పతకాలు, సర్టిఫికెట్స్ అందజేసి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా చిన్నారులను నంద్యాలకు చెందిన ప్రముఖ చిత్రకారులు రామప్రసాద్ అభినందించారు.

కోదండ రామాలయంలో తిరుప్పావై ప్రవచనాలు

నంద్యాల కల్చరల్, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): నంద్యాల సంజీవనగర్ కోదండ రామాలయంలో తిరుప్పావై ప్రవచనాల కార్యక్రమం కొనసాగుతోంది. టీటీడీ ఆళ్వార్ దివ్య ప్రబంధ ప్రాజెక్టు, నంద్యాల భగవత్ సేవా సమాజ్ కమిటీ సంయుక్త నిర్వహణలో నిర్వహిస్తున్న తిరుప్పావై ప్రవచనా కార్యక్రమానికి డాక్టర్ దివి హయగ్రీవాచార్యులు వ్యాఖ్యాతగా వ్యవహరిస్తున్నారు. కార్యక్రమంలో భాగంగా ఆదివారం 21వ పాశురం గురించి వివరించారు. ఈ పాశురంలో స్వామిని నిద్ర నుంచి మేల్కొపు విధానం, గోదాదేవి విష్ణుమూర్తిని కీర్తిచే పద్ధతుల గురించి వ్యాఖ్యాత చక్కగా వివరించారు. గోవిందా నామస్మరణతో భక్తులు పరవశమయ్యారు. కార్యక్రమంలో భగవత్ సేవాసమాజ్ కమిటీ అధ్యక్షుడు సముద్రాల సూరయ్య, కమిటీ సభ్యులు పార్థసారధి క్రిష్ణ, శ్రీనివాస్, భక్తులు పాల్గొన్నారు.

ముగిసిన కళాశాల స్వర్ణోత్సవాలు

● వేలాదిగా తరలివచ్చిన విద్యార్థులు
● నాటి మధుర జ్ఞాపకాలను పంచుకున్న స్నేహితులు
● గురువులను సత్కరించిన పూర్వ విద్యార్థులు

ఆత్మకూరు, జనవరి 5(ఆంధ్రజ్యోతి): ఆత్మకూరు ప్రభుత్వ జూనియర్ కళాశాల స్వర్ణోత్సవ వేడుకలు ఆదివారం ఘనంగా ముగిశాయి. 1974లో ఏర్పాటైన ఈ కళాశాల 50ఏళ్లను పూర్తి చేసుకున్న సందర్భంగా రెండు రోజుల పాటు నిర్వహించిన ఆత్మీయ సమ్మేళనంలో పూర్వ విద్యార్థుల ఆనందాలకు అవధుల్లేకుండా పోయాయి. వివిధ ప్రాంతాల్లో స్థిరపడిన పూర్వవిద్యార్థులు హాజరై అలనాటి మధుర జ్ఞాపకాలను తోటి స్నేహితులతో పులకించిపోయారు. అలాగే కళాశాలలో కలియ తిరుగుతూ పాత జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. అనంతరం ఈ కళాశాలలో చదివిన పూర్వ విద్యార్థులు అనేక హోదాల్లో స్థిరపడిన వారిని ఘనంగా సత్కరించారు. కర్నూలు మెడికల్ కాలేజి వైస్ ప్రిన్సిపాల్ సాయి సుధీర్,కిమ్స్ డైరెక్టర్ డాక్టర్ రఫీక్ అహ్మద్ పీడియాట్రిస్ట్, వైస్ ఛాన్సిలర్ విక్రమ్ సింహ యూని వర్శిటి నెల్లూరు ప్రొఫెసర్ విజయ భాస్కరరావు,ఇస్రో రిటైర్ట్ సైంటిస్ట్,బిర్లా సైన్స్ ఇన్‌స్టిట్యూట్ టీఎం హైదరాబాద్ కే. మృత్యుంజయ రెడ్డి, రిటైర్డ్ సీనియర్ మేనేజర్ ఇండియన్ బ్యాంక్ మునీశ్వరయ్య, రిటైర్డ్ డైరెక్టర్ ఎంప్లాయ్‌మెంట్ డాక్టర్ కేవి స్వామి,వ్యవసాయాధికారులైన ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, విశ్వనాధ్‌లను, కళాశాల స్థలదాత కుటుంబీకులు వెన్నా భోగిరెడ్డిని కళాశాల అధ్యాపక బృందం వారిని ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కష్టపడితే దేన్నైనా సాధించవచ్చునన్న విషయానికి ప్రస్తుత పూర్వ విద్యార్థులను చూస్తే అందరికీ అర్థమవుతుందన్నారు. ప్రభుత్వం ఏదో చేయాలని ఎదురు చూడకుండా తమకు విద్యాబుద్ధులు నేర్పించిన కళాశాలకు పూర్వవిద్యార్థులు చేయిచేయి కలిపి అభివృద్ధి చేయాలనుకోవడం గొప్ప విషయమన్నారు. అదేక్రమంలో భవిష్యత్‌లో కళాశాల విద్యార్థులను ప్రోత్సహించేలా ప్రతిఏటా విద్యార్థులకు నగదు పారితోషికాలు ఇచ్చేందుకు తమ వంతు సహాయ సహకారాలు అందిస్తామని తెలిపారు. కళాశాల అభివృద్ధి కోసం పూర్వ విద్యార్థులు కళాశాలకు తమ విరాళాలను అందజేశారు. ఏవీ నారాయణ రెడ్డి పారిశ్రామిక వేత్త రెండు తరగతి గదుల నిర్మాణానికి 15 లక్షలు, బీ. వంశికృష్ణ సాఫ్ట్ వేర్ ఉద్యోగి 8 లక్షలు మిగతా వారు తమ వంతు సహాయాన్ని అందజేశారు.అంతకు ముందు పూర్వ విద్యార్థులలో మృతి చెందిన వారికి తమ సంతాపం వెలిబుచ్చుతూ రెండు నిమిషాలు వేదికలో మౌనం పాటించారు. ఈ వేడుకకు విచ్చేసిన వారందరికీ శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి రెండో రోజు కూడా భోజన సదుపాయాన్ని కల్పించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రఘురామాచార్యులు, ఎల్ఐసీ బ్రాంచ్ మేనేజర్ పాండు రంగ నాయక్, ఆర్యవైశ్య సంఘం నాయకులు పువ్వాడి భాస్కర్, డీఆర్‌డీఏ శాస్త్రవేత్త వీరబ్రహ్మం, కళాశాల అధ్యాపకులు సలీం ఎండి బ్రహ్మానందం షాపా వలి, శివశంకర్‌రెడ్డి,డాక్టర్ మురళికృష్ణ ,డాక్టర్ సుజాత, రవి కుమార్ తదితరులు ఉన్నారు.



మాట్లాడుతున్న పూర్వ విద్యార్థి కర్నూలు మెడికల్ కాలేజ్ వైస్ ప్రిన్సిపాల్ సాయి సుధీర్



సమావేశానికి హాజరైన పూర్వ విద్యార్థులు



మధుర జ్ఞాపకంగా ఉంచుకునేందుకు ఫొటో దిగుతున్న 1978-80 బ్యాచ్ విద్యార్థులు



పూర్వ విద్యార్థి ప్రొఫెసర్ విజయ భాస్కర్‌ను సన్మానిస్తున్న కళాశాల అధ్యాపకులు

డోన్

డోన్, ఆళ్లగడ్డ, బనగానపల్లె

బెలుం గుహలను సందర్శించిన ఎస్పీ



గుహల వద్ద ఎస్పీ అధిరాజ్‌సింగ్ రాణా

కొలిమిగుండ్ల, జనవరి 5 (ఆంధ్రజ్యోతి) : నంద్యాల జిల్లా ఎస్పీ అధిరాజ్‌సింగ్ రాణా ఆదివారం కుటుంబ సభ్యులతో కలిసి బెలుం గుహలను సందర్శించారు. ఈ సందర్భంగా బెలుం గుహల వద్ద పోలీస్ అధికారులు ఎస్పీకి సాదరస్వాగతం పలికారు. అనంతరం గుహల్లోని ధ్యాన మందిరం, వెయ్యిపడగలు, సప్తస్వరాలు, పాతాళగంగ తదితర ప్రాంతాలను వీక్షించారు. గుహల యొక్క ప్రాధాన్యత, చరిత్ర గురించి అడిగి తెలుసుకున్నారు. సహజ సిద్ధంగా ఏర్పడిన బెలుం గుహల అందాలు అద్భుతంగా ఉన్నాయని ఎస్పీ అభిప్రాయపడ్డారు.

ముందస్తుగా సంక్రాంతి సంబరాలు



చాగలమర్రిలో ఆటల పోటీలో విజేతలుగా నిలిచిన మహిళలు

చాగలమర్రి, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): చాగలమర్రి గ్రామంలోని కన్యకాపరమేశ్వరి కల్యాణ మండపంలో ముందస్తు సంక్రాంతి సంబరాలను ఆదివారం ఆర్యవైశ్య సభ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. మహిళలకు వివిధ ఆటల పోటీలను నిర్వహించారు. త్రోబాల్, క్యారమ్స్, చెస్, తాడు లాగు పందెం పోటీలను నిర్వహించారు. ఈ పోటీల్లో విజేతలైన మహిళలకు బహుమతులను దాత సుబ్రహ్మణ్యం అందజేస్తారని ఆలయ అధ్యక్షుడు లక్ష్మణబాబు తెలిపారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు మల్లికార్జున, రాజేష్, సంయోజిత కన్వీనర్ లక్ష్మీదేవి, మహిళలు పాల్గొన్నారు.

ఎంపీని కలిసిన ధర్మవరం సుబ్బారెడ్డి



ఎంపీ కేశినేని శివనాథ్‌కు బొకే ఇస్తున్న ధర్మవరం సుబ్బారెడ్డి

డోన్ రూరల్, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): విజయవాడ కేంద్ర టీడీపీ కార్యాలయంలో విజయవాడ పార్లమెంటు సభ్యుడు కేశినేని శివనాథ్‌ను రాష్ట్ర సీడ్స్ కార్పొరేషన్ డెవలప్‌మెంట్ చైర్మన్ ధర్మవరం సుబ్బారెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. ఎంపీకి పుష్పగుచ్ఛం అందజేసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. డోన్ మాజీ మార్కెట్ యార్డు చైర్మన్ మురళికృష్ణగౌడు, పట్టణ అధ్యక్షులు సీఎం శ్రీనివాసులు తదితరులు ఉన్నారు.

రేపు అంగన్‌వాడీల సమస్యలపై నిరసన

డోన్ రూరల్, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ వర్కర్ల సమస్యలు పరిష్కరించాలని ఈ నెల 7న చేపట్టే నిరసనను జయప్రదం చేయాలని అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ అసోసియేషన్ ఏఐటీయూసీ జిల్లా నాయకురాలు జులేఖ పిలుపునిచ్చారు. ఆదివారం పట్టణంలోని సీపీఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో జులైఖ మాట్లాడుతూ అంగన్‌వాడీ హెల్పర్స్ వేతనాల పెంపుపై కేంద్ర ప్రభుత్వం తక్షణమే స్పందించాలని డిమాండ్ చేశారు. అంగన్‌వాడీ వర్కర్ల సమస్యలు పరిష్కరించడంలో ప్రభుత్వం విఫలమైందన్నారు. సమావేశంలో ఏఐటీయూసీ, అనుబంధ సంఘాల నాయకులు పుల్లయ్య, అబ్బాస్, స్వర్ణలత పాల్గొన్నారు.

'వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చాలి'

ప్యాపిలి, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చాలని ఆ సంఘం నాయకులు బాలరంగయ్య, కేశవులు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. ఆదివారం ప్యాపిలిలో వారు మాట్లాడుతూ వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేరుస్తామన్న పాలకుల హామీలు నీటి మూటలవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. నంద్యాల పార్లమెంటు సభ్యురాలు బైరెడ్డి శబరి వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చాలని కేంద్ర మంత్రి అమిత్‌షాను కోరడం హర్షణీయమన్నారు. ఈ సందర్భంగా వాల్మీకి నేతలు శబరికి ధన్యవాదాలు తెలిపారు. ఇచ్చిన హామీ మేరకు పాలకులు వాల్మీకుల ఎస్టీ జాబితాలో చేర్చడంపై అసెంబ్లీలో తీర్మాణం చేసి పార్లమెంటుకు పంపాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మద్దిలేటి, నాయుడు పాల్గొన్నారు.

సత్ప్రవర్తనతో మెలగాలి: సీఐ

బేతంచెర్ల, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): సమాజంలో రౌడీల్లా కాకుండా ప్రజలతో సత్ప్రవర్తనతో మెలగాలని సీఐ వెంకటేశ్వరరావు సూచించారు. ఆదివారం పోలీస్ స్టేషన్ ప్రాంగణంలో మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన రౌడీషీటర్లకు కౌన్సిలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ ప్రజలను భయభ్రాంతులకు గురి చేసి అలర్లకు పాల్పడి, ప్రజాశాంతికి భంగం కలిగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. శాంతియుతంగా జీవించాలన్నారు. కార్యక్రమంలో ఎస్ఐ రమేష్ బాబు, పోలీసు సిబ్బంది ఉన్నారు.

సమాజంలో జర్నలిస్టుల పాత్ర కీలకం

ఆళ్లగడ్డ(శిరివెళ్ల), జనవరి 5 (ఆంధ్రజ్యోతి): సమాజంలో జర్నలిస్టుల పాత్ర కీలకమైనదని రోటరీ క్లబ్ ఆళ్లగడ్డ అధ్యక్షుడు రామకృష్ణారెడ్డి, ప్రధాన కార్యదర్శి రత్నరాజు అన్నారు. పట్టణంలోని రోటరీక్లబ్ కార్యాలయంలో స్పోర్ట్స్ జర్నలిస్ట్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఓబులం ప్రసాద్‌ను ఆదివారం ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్ మాజీ అధ్యక్షుడు టీఎంసీ వేణుగోపాల్, విశ్రాంత హెచ్‌ఎం శంకర్‌రెడ్డి, దేవిశెట్టి హరిబాబు, శబరి సత్యం, సుబ్బారెడ్డి, సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

మంత్రి బీసీని కలసిన ఆళ్లగడ్డ డీఎస్పీ

బనగానపల్లె, జనవరి 5, (ఆంధ్రజ్యోతి): బనగానపల్లె పట్టణంలోని రోడ్లు భవనాల శాఖామంత్రి బీసీ జనార్దన్‌రెడ్డిని ఆళ్లగడ్డ డీఎస్పీ రవి కుమార్ ఆదివారం మర్యాదపూర్వకంగా కలిశారు. అలాగే సీఐలు ప్రీతం రెడ్డి, వెంకటరామిరెడ్డి, రాకేశ్, చంద్రబాబునాయుడు, నరేంద్రకుమార్ రెడ్డి, బనగానపల్లె విద్యుత్ ఏడీ మద్దిలేటి, ఏఈలు గర్లప్ప, శ్రీనివాసులు, టీడీపీ పట్టణ అధ్యక్షుడు కాశీంబాబు, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ మధుసూదన్, ఏఈ సాయికుమార్, అవుకు రిజర్వాయర్ ఈఈ వెంకటసురేశ్ బాబు, వివిధ శాఖల అధికారులతో బీసీ సమీక్షించారు.

వైకుంఠ ఏకాదశికి ముమ్మర ఏర్పాట్లు

బనగానపల్లె, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కొండపేటలో వేంకటేశ్వరస్వామి ఆలయం వద్ద వైకుంఠ ఏకాదశి వేడుకల ఏర్పాట్లను టీడీపీ నాయకురాలు బీసీ ఇందిరమ్మ ఆదివారం పర్యవేక్షించారు. వేంకటేశ్వరస్వామి ఆలయాన్ని నూతనంగా నిర్మించాలని గతేడాది పూనుకున్నారు. అయితే ఈనెల 10న వైకుంఠ ఏకాదశి పర్వదినం సందర్భంగా బీసీ ఇందిరమ్మ ఆధ్వర్యంలో ఆలయ ఆవరణంలో ఎక్స్‌కవేటర్‌తో చదును చేయించారు. ఆలయ ప్రాంగణంలో భారీగా సెట్టింగ్ వేసి శివాలయం వద్ద ఉన్న వెంకటేశ్వరస్వామి విగ్రహాన్ని ఆలయ ప్రాంగణానికి తరలించడానికి సన్నాహాలు ప్రారంభించారు. నాయకులు శ్రీనయ్య, కృష్ణానాయక్, శేఖర్, బాలుడు పాల్గొన్నారు.

ఆదమరిస్తే అంతే సంగతులు!

- శిథిలావస్థలో వంతెనలు
- ఇబ్బందుల్లో వాహనదారులు
- నిత్యం ప్రమాదాలు..
- పట్టించుకోని అధికారులు



కల్వటాల వద్ద రక్షణ గోడలేని ఎర్రవాగు వంతెన

కొలిమిగుండ్ల, జనవరి 5 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని నెల్లూరు-ముంబై రాష్ట్ర హైవేపై వంతెనలు అత్యంత ప్రమాదకరంగా మారాయి. వాహనదారులు ఏమాత్రం ఆదమరిచినా అంతే సంగతులు అన్న పరిస్థితులు నెలకొన్నాయి. అనంతపురం, తాడిప్రతి, గుత్తి, బళ్లారి ప్రాంతాల నుంచి కడప, నెల్లూరు, ప్రొద్దుటూరు ప్రాంతాలకు వెళ్లే వాహనాలు ప్రతి రోజూ వేల సంఖ్యలో ఈ రహదారి గుండా రాకపోకలు సాగిస్తూ ఉంటాయి. అయితే కొలిమిగుండ్ల సమీపంలోని ఢాకానాయిని బ్రిడ్జితో పాటు, కల్వటాల గ్రామం వద్ద ఎర్రవాగుపై ఉన్న వంతెన అత్యంత ప్రమాదకరంగా ఉన్నాయి. ఏళ్ల క్రితం నిర్మించిన వంతెనలు కావడంతో ఇరుకుగా మారాయి. మరోవైపు రక్షణ గోడలు లేకపోవడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ముఖ్యంగా రాత్రి సమయాల్లో ప్రయాణించే వాహనాలు రక్షణ గోడలు లేక అతి వేగంతో బోల్తా పడుతున్నాయి. వందల సంఖ్యలో ప్రయాణికులు క్షతగాత్రులుగా మారడంతో పాటు ప్రాణాలు కోల్పోయిన ఘటనలు ఉన్నాయి. ప్రతి వారంలో ఒకటి లేదా రెండు వాహనాలు తప్పనిసరిగా ఈ వంతెనల వద్ద ప్రమాదానికి గురి అవుతున్నాయంటే పరిస్థితి ఎంత దయనీయంగా ఉందో అర్థం చేసు కోవచ్చు. బ్రిడ్జిలకు మరమ్మతులు నిర్వహించి ప్రమాదాలను అరికట్టాలని ఆయా గ్రామాల ప్రజలతో పాటు, వాహన చోదకులు కోరుతున్నారు.

రక్షణ గోడను ఢీకొట్టిన లారీ

- 6గంటలపాటు ట్రాఫిక్‌కు అంతరాయం



రోడ్డు కిందకు దూసుకపోయిన లారీ

కొలిమిగుండ్ల : మండలంలోని రామ్‌కో సిమెంట్ ప్యాక్టరీ సమీపంలో నెల్లూరు-ముంబై రాష్ట్ర హైవేపై ఢాకానాయిని బ్రిడ్జి లో మట్టి లారీ రక్షణ గోడను ఢీకొనడంతో రాకపోకలు స్తంభించాయి. దీంతో ఆరుగంటల పాటు వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఆదివారం తెల్లవారుజామున కర్ణాటక రాష్ట్రం మంగళూరు నుంచి మట్టి లోడుతో కడప జిల్లా సిమెంట్ పరిశ్రమకు వెళుతున్న లారీ కొలిమిగుండ్ల సమీపంలో ఢాకానాయిని బ్రిడ్జి రక్షణ గోడను ఢీకొని వంకలోకి దూసుకెళ్లింది. వంతెనపై సగం వాహనం నిలిచిపోవడంతో తెల్లవారుజాము నుంచి వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఉదయం అక్కడికి చేరుకున్న పోలీసులు ఇరుక్కుపోయిన లారీలో మట్టిని మరో లారీలోకి మార్చి, అడ్డుపడిన వాహనాన్ని తొలగించారు. దీంతో ఉదయం 11గంటల తరువాత వాహనాల రాకపోకలు తిరిగి కొనసాగడంతో వాహనదారులు, ప్రయాణికులు ఊపిరి పీల్చుకున్నారు.

నేటి తరానికి తెలియజేయాలి

- రాష్ట్ర రోడ్లు భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి



'రేనాటి చంద్రుడు' పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి

కర్నూలు కల్చరల్, జనవరి 5(ఆంధ్రజ్యోతి): రేనాటి చంద్రుడిగా ఖ్యాతికెక్కిన ఉయ్యాలవాడ బుడ్డా వెంగళరెడ్డి చేసిన దానధర్మాల చరిత్ర, ఆయన సేవలు నేటి తరానికి అందించాల్సిన అవసరం ఎంతో ఉందని రాష్ట్ర రోడ్డు భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి అన్నారు. ఆదివారం సాయంత్రం బనగానపల్లిలోని మంత్రి కార్యాలయంలో 'రేనాటి చంద్రుడు' పుస్తకం (నవల) ఆయన ఆవిష్కరించారు. పుస్తక రచయిత, టీజీవీ కళాక్షేత్రం అధ్యక్షుడు పత్తి ఓబులయ్య పుస్తకంలో బుడ్డా వెంగళరెడ్డి జీవిత విశేషాలను, ఆయన చేసిన దానధర్మాలను మంత్రికి వివరించారు. ఈ సందర్భంగా మంత్రి బీసీ మాట్లాడుతూ ఒకప్పుడు రాష్ట్రంలో కరువు తాండవిస్తున్న కాలంలో, జిల్లాలో డొక్కల కరువుగా మారిందని, అప్పుడు బుడ్డా వెంగళరెడ్డి గంజి కేంద్రాలను ఏర్పాటు చేసి, అన్నార్థులకు అండగా నిలిచారని కొనియాడారు. దాతృత్వ గుణంలో ఆయన రేనాటి చంద్రునిగా ప్రసిద్ధి కెక్కారని, ఆయన ఆనాడు ప్రజలకు అందించిన సేవలను ఈనాటి తరానికి తెలియజేసేలా పుస్తకాన్ని ముందుకు తీసుకురావడం అభినందనీమని పుస్తక రచయిత పత్తి ఓబులయ్యను ప్రత్యేకంగా ప్రశంసించారు. కార్యక్రమంలో టీజీవీ కళాక్షేత్రం ఉపాధ్యక్షుడు సీవీ రెడ్డి, బనగానపల్లె అరుణభారతి సంస్థ అధ్యక్షుడు బీసీ రాజారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలతో అప్రమత్తంగా ఉండాలి



మాట్లాడుతున్న సీఐ హనుమంతనాయక్

కోవెలకుంట్ల, జనవరి 5 (ఆంధ్రజ్యోతి) : సైబర్ నేరాలపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకుని అప్రమత్తంగా ఉండాలని కోవెలకుంట్ల సీఐ హనుమంత నాయక్ సూచించారు. ఆదివారం పట్టణంలోని ఇందిరమ్మకాలనీలో కోవెలకుంట్ల ఎస్ఐ మల్లిఖార్జునరెడ్డి, సంజామల ఎస్ఐ రమణయ్య తమ సిబ్బందితో కలిసి కార్డన్‌సెర్చ్‌లో ఇళ్లను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కాలనీలో పత్రాలు లేని 30 బైకులను, ఐదు ఆటోలను గుర్తించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో సీఐ మాట్లాడుతూ కాలనీలో కొత్తవారికి ఇళ్లు బాడుగకు ఇచ్చేటప్పుడు వారి పూర్తి వివరాలు తెలుసుకోవాలన్నారు. ఎవరికి పడితే వారికి ఇళ్లు బాడుగకు ఇవ్వరాదన్నారు. అంతే కాకుండా కాలనీల్లో అసాంఘిక కార్యకలాపాలు జరుగుతున్నాయని తమ దృష్టికి వచ్చిందన్నారు. అలాంటివి జరుగుతుంటే పోలీసులకు సమాచారం అందించాలన్నారు.

సాదాసీదాగా సామాజిక తనిఖీ



సమావేశంలో మాట్లాడుతున్న సామాజిక తనిఖీ సభ్యుడు

సంజామల, జనవరి 5(ఆంధ్రజ్యోతి): జాతీయ ఉపాధి పథకం ద్వారా చేపట్టిన పనులపై నిర్వహించిన సామాజిక తనిఖీ సాదాసీదాగా ముగిసింది. ఏప్రిల్ 1, 2023 నుంచి మార్చి 31, 2024 వరకు చేపట్టిన పనులపై ఆదివారం సామాజిక తనిఖీపై బహిరంగ సభను ఏపీవో సూర్యప్రకాష్ ఆధ్వర్యంలో నిర్వహించారు. సంజామలకు సంబంధించి 95 పనులు చేపట్టగా అత్యధికంగా భవనాలు, రోడ్లకు రూ. 47లక్షలు వెచ్చించారు. పండ్ల తోటల పెంపకాలు, కొబ్బరి తోటలు, గృహ నిర్మాణాలకు సంబంధించి రూ. 27లక్షలు వెచ్చించారు. ప్రధానంగా సీసీ రోడ్లకు నిధులను కేటాయించారు. మొత్తంగా కొండను తవ్వి ఎలుకను పట్టిన చందంగా పథకంలో అవినీతి జరగలేదని సామాజిక తనిఖీ బహిరంగ సభలో అధికారులు తేల్చేశారు. కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది, పీఆర్ ఏఈ రషీద్, వెటర్నరీ అసిస్టెంట్ సుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

నేడు దివ్యాంగ పింఛన్ల పరిశీలన

ఉయ్యాలవాడ, జనవరి 5(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆయా గ్రామాల్లో దివ్యాంగ పింఛన్లను పరిశీలించటానికి సోమవారం ప్రత్యేక వైద్య బృందం వస్తున్నట్లు ఎంపీడీవో ఉమమహేశ్వరరావు ఆదివారం తెలిపారు. మండలంలోని హరివరం, అల్లూరు, మాయలూరు, బోడెమ్మనూరు, ఇంజేడు, ఆర్.జంబులదిన్నె గ్రామాల్లో పర్యటించి వైద్య పరీక్షలు చేస్తారన్నారు. అనంతరం రిపోర్టు తయారు చేసి ఉన్నతాధికారులకు పంపుతారని ఆయన తెలిపారు. నోటీసులు అందుకున్న పింఛన్ దారులు అందుబాటులో ఉండి వైద్యులకు సహకరించాలన్నారు.

నేలవాలిన విద్యుత్ స్తంభం



రైతు పొలంలో కిందపడిన విద్యుత్ స్తంభం

ఉయ్యాలవాడ, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో పరిశ్రమలను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం నాణ్యమైన విద్యుత్‌ను అందించటమే లక్ష్యంగా త్రీఫేస్ విద్యుత్‌ను సరఫరా చేయటం కోసం కొత్తగా 11 కేవీ విద్యుత్ లేన్లను ఏర్పాటు చేస్తుంది. దీంట్లో భాగంగా సంబంధిత కాంట్రాక్టర్ ఉయ్యాలవాడ మండలంలో స్తంభాలను ఏర్పాటు చేసి తీగలను లాగుతున్నారు. అయితే మండలంలోని రూపనగుడి - మాయలూరు గ్రామాల మధ్య తీగలను లాగారు. రూపనగుడి గ్రామానికి చెందిన ఓ రైతు పొలంలో ఏర్పాటు చేసిన విద్యుత్ స్తంభం నాలుగు రోజులకే నేలవాలింది. అయితే విద్యుత్ సరఫరాలేకపోవటంతో ఎలాంటి ప్రమాదం లేకపోయినా స్తంభం ఏర్పాటులో నాణ్యత లేకపోవటం వల్లే నేల వాల్చిందనే విమర్శలు వినిపిస్తున్నాయి. అంతేకాకుండా నూతనంగా అమర్చిన స్తంభాలు కూడా ఓ వైపునకు వాలిపోయి ఉన్నాయి. అవి ఎప్పుడు కింద పడిపోతాయోనని రైతులు ఆందోళన చెందుతున్నారు. దీనిపై కంస్ట్రక్షన్ ఏఈ క్రిష్ణమూర్తిని వివరణ కోరగా పర్యవేక్షించి చర్యలు తీసుకుంటామన్నారు.

సూర్యనారాయణ ఆశయ సాధనకు కృషి

బేతంచెర్ల, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): ప్రతి కార్మికుడు సూర్యనారాయణ ఆశయ సాధన కోసం కృషి చేయాలని సీపీఎం సీనియర్ నాయకులు ఎల్లయ్య, వెంకటేశ్వర్లు పిలుపునిచ్చారు. ఆదివారం పట్టణంలోని మోటారు వర్కర్స్ యూనియన్ కార్యాలయంలో సూర్యనారాయణ 37వ వర్ధంతిని నిర్వహించారు. సూర్యనారాయణ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు ఎల్లయ్య, రహంతుల్లా, మధుశేఖర్, సీఐటీయూ, సీపీఎం , కార్మిక సంఘాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ట్రాక్టరు నుంచి కింద పడి యువకుడి మృతి

అవుకు, జనవరి 5 (ఆంధ్రజ్యోతి) : ట్రాక్టర్ నుంచి కిందపడి యువకుడు మృతి చెందాడు. ఈ ఘటన అవుకు మండలం ఇస్రానాయక్‌తండా సమీపంలో ఆదివారం చోటు చేసుకున్నది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు ఉప్పలపాడు గ్రామం నుంచి నేరెడుజల్లకు వరిగడ్డిని తరలిస్తున్న క్రమంలో డ్రైవరు సీటు వెనుక భాగంలో నాగార్జున(25) అనే యువకుడు కూర్చున్నాడు. ఇస్రానాయక్ తండా దాటిన తరువాత రహదారి సరిగా లేక పోవటంతో గతుకులకు ట్రాక్టరు నుంచి నాగార్జున ఎగిరి కింద పడ్డాడు. తల వెనుక భాగంలో బలమైన గాయం కావటంతో అవుకు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ కోలుకోలేక మృతి చెందాడు. మృతుని తండ్రి చిన్నకుంటెన్న ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు వెల్లడించారు.

చికిత్సపొందుతూ..

ఆళ్లగడ్డ(శిరివెళ్ల), జనవరి 5 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఓబులంపల్లె గ్రామానికి చెందిన మల్లికార్జున(25) అనే యువకుడు చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఆళ్లగడ్డ రూరల్ ఎస్ఐ హరిప్రసాద్ ఆదివారం తెలిపారు. మృతుడి భార్య నాగమల్లేశ్వరి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

వరి గడ్డి ట్రాక్టర్ బోల్తా

అవుకు, జనవరి 5 (ఆంధ్రజ్యోతి) : వరిగడ్డి లోడ్‌తో వెళుతున్న ట్రాక్టర్ అవుకు బస్టాండు సర్కిల్‌లో ఆదివారం బోల్తా పడింది. వరిగడ్డిని గోకులదిన్నె నుంచి రామాపురం గ్రామానికి తరలించే క్రమంలో అవుకు బస్టాండు సర్కిల్ సమీపంలో అదుపుతప్పి ట్రాక్టర్ ట్రాలీ బోల్తా పడింది. ఎలాంటి ప్రాణహాని జరగలేదు.

రాష్ట్రస్థాయి పోటీల్లో విద్యార్థి ప్రతిభ

కొలిమిగుండ్ల, జనవరి 5 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని తిమ్మనాయినిపేట గ్రామానికి చెందిన ఆకాంక్ష స్పోర్ట్స్ అకాడమీ ఫర్ ఆల్ విద్యార్థి లక్ష్మీ శాంతి రాష్ట్రస్థాయి 59వ ఏపీ క్రాస్ కంట్రీ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ పోటీల్లో అండర్-16 కేటగిరిలో రెండో స్థానం సాధించినట్లు అకాడమీ కార్యదర్శి రాజేష్ ఆదివారం వెల్లడించారు. జనవరి 12 ఉత్తరప్రదేశ్ మీరట్‌లో జరగనున్న జాతీయ స్థాయి పోటీల్లో ఆమె పాల్గొనున్నారు. లక్ష్మీ శాంతిని కోచ్ విజయ్‌కుమార్‌ను ఆకాంక్ష వ్యవస్థాకుడు సాయివంశీవర్ధన్ అభినందించినట్లు రాజేష్ తెలిపారు.

వివేకానందుని బోధనలు ఆదర్శం

బనగానపల్లె, జనవరి 5, (ఆంధ్రజ్యోతి): వివేకానందుని బోధనలు ప్రపంచానికి ఆదర్శమని జేకేఆర్ సంక్షేమ సంఘం అధ్యక్షుడు బ్రహ్మానందాచారి అన్నారు. ఆదివారం పలుకూరు రామాయలంలో వివేకానందుని విశిష్టత, ఆధ్యాత్మికతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. వివేకానంద బోధనల పుస్తకాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో బాలహనుమంతు, వెంకటసుబ్బయ్యగౌడ్ పాల్గొన్నారు.

సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ కార్యవర్గం ఎన్నిక

ఆళ్లగడ్డ(శిరివెళ్ల), జనవరి 5 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని విశ్వశాంతి విద్యానికేతన్‌లో నంద్యాల జిల్లా సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ కార్యవర్గ సభ్యులను ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా చైర్మన్‌గా విశ్వశాంతి విద్యాలయ స్కూల్ కరస్పాండెంట్ శ్రీనాథరెడ్డి, వైస్ చైర్మన్‌గా బ్రహ్మానందరెడ్డిని ఎన్నుకున్నారు. అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి నాగేంద్ర, పీడీ చంద్రశేఖర్, లీగల్ అడ్వైజర్ వినోద్ కుమార్, విజయ్ కుమార్, శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేడు ప్రజాదర్బార్

బేతంచెర్ల, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేందుకు ప్రజాదర్బార్ కార్యక్రమాన్ని సోమవారం నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ ప్రకాష్‌బాబు ఆదివారం తెలిపారు. గ్రామాల్లో ప్రజలు, రైతులు తమ సమస్యలను అర్జీ రూపంలో అందజేయాలని సూచించారు. మండల స్థాయి అధికారులు తప్పక హాజరు కావాలన్నారు.

8న వెల్లాల క్షేత్రంలో వేలం పాటలు

చాగలమర్రి, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వెల్లాల క్షేత్రంలో గల చెన్నకేశవ, సంజీవరాయ, భీమలింగేశ్వర స్వామి ఆలయాలకు సంబంధించి భక్తులు సమర్పించిన తలనీలాల వేలం 8న నిర్వహిస్తున్నట్లు ఈవో కేవీ రమణ ఆదివారం తెలిపారు. ఈ వేలం పాటలో పాల్గొనే హక్కుదారులు రూ.లక్ష డిపాజిట్ చెల్లించి వేలంలో పాల్గొనాలని తెలిపారు. టెంకాయలు, పూజ సామాగ్రీ అమ్ముకొనుటకు రూ. 50 వేలు, కొబ్బరి చిప్పలు పోగు చేసుకునే హక్కుకు రూ.10వేలు, భక్తులు సమర్పించిన పోగు చేసి నిల్వ ఉంచిన తలనీలాలు వేలంకు రూ.10 వేలు నగదు డిపాజిట్ చెల్లించాలని అన్నారు. వేలం పాటలో హక్కుదారులకు ఏడాది పాటు హక్కు కలిగి ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఆలయ సహాయ అధికారి రామ్మోహన్ ఉన్నారు.

డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేయాలి

డోన్ రూరల్, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం వెంటనే డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేయాలని ఎస్‌ఎస్‌యూఐ రాష్ట్ర కార్యదర్శి దోనిరాజు, నంద్యాల జిల్లా ఉపాధ్యక్షులు తెలుగు విజయకుమార్ డిమాండ్ చేశారు. ఆదివారం సాయంత్రం పట్టణంలోని ఎస్‌ఎస్‌యూఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేసి ఉద్యోగాలకు భర్తీ చేయాలని కోరారు.

సంతాన వేణుగోపాలుడికి ప్రత్యేక పూజలు



రుద్రవరంలో పూజలందుకున్న సంతాన వేణుగోపాలస్వామి

రుద్రవరం, జనవరి 5 (ఆంధ్రజ్యోతి) : రుద్రవరంలో సంతాన వేణుగోపాలస్వామికి ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకులు అభిషేకం చేసి పూజలు ప్రారంభించారు. భక్తులు వేణుగోపాలస్వామి, సత్యభామ రుక్మిణీ అమ్మవార్లను దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం గీతాపారాయణం చేశారు. తరలివచ్చిన భక్తులకు తీర్థ ప్రసాదాలు పంచిపెట్టారు.

గ్రామ దేవతలకు ప్రత్యేక పూజలు

రుద్రవరం మండలంలోని చిన్నకంబలూరు, రుద్రవరం, కొండమాయపల్లె, ఇంకా పలు గ్రామాల్లో ఆదివారం గ్రామ దేవతలకు ప్రత్యేక పూజలు చేశారు. పెద్దమ్మ, మారెమ్మ, సుంకులమ్మ అమ్మవార్లకు పూజలు చేసి అమ్మవార్లను దర్శించుకుని చీరలు, బోనాలు సమర్పించారు. గ్రామ దేవతలను పూజిస్తే పాడిపంటలు చల్లగా ఉంటాయని మహిళలు నమ్మకం వ్యక్తం చేశారు.

డోన్‌లో బ్రాహ్మణ సంఘం సమావేశం

డోన్ రూరల్, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని గాయత్రీ పీఠంలో ఆదివారం వేదమాత బ్రాహ్మణ సంఘం సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించారు. సమావేశంలో సంఘం జిల్లా అధ్యక్షుడు శంకర్ శర్మ, వేద మాత బ్రాహ్మణ మాత సంఘం గౌరవాధ్యక్షుడు శతావధాని దత్తాత్రేయ శర్మ, ఉపాధ్యక్షులు కల్లె శేషావలి శర్మ తదితరులు పాల్గొన్నారు. డోన్ బ్రాహ్మణ సంఘం మొదటి అధ్యక్షుడు రాధా కృష్ణన్ చిత్రపటానికి వారు శ్రద్ధాంజలి ఘటించారు. భవిష్యత్తులో జరిగే కార్యక్రమాలపై చర్చించారు.

క్యాలెండర్ ఆవిష్కరణ

చాగలమర్రి, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): చాగలమర్రి గ్రామంలోని చెన్నకేశవ ఆలయంలో అహోబిల క్షేత్రంలోని కుమ్మర్ల అన్న సత్రం క్యాలెండర్లను ఆదివారం ఆ సంఘం అధ్యక్షుడు రామతీర్థం, గౌరవ అధ్యక్షుడు నారాయణ, కోశాధికారి రామకృష్ణ, కార్యదర్శి బాలసుబ్బయ్య ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. కుమ్మర్ల సంఘ ఆధ్వర్యంలో ప్రతి ఏడాది అహోబిలంలో జరిగే బ్రహ్మోత్సవాలకు అన్నదానం ఏర్పాటు చేస్తున్నామని సంఘం అధ్యక్షుడు రామతీర్థం పేర్కొన్నారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ రామసుబ్బయ్య, టీఎన్‌టీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుత్తి నరసింహులు, హిందూ సంఘం నాయకులు హేమ, సురేష్, రామకృష్ణ పాల్గొన్నారు.

హెల్మెట్ తప్పనిసరి

దొర్నిపాడు, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): ద్విచక్రవాహనదారులు హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని ఎస్ఐ వెంకటేష్ అన్నారు. ఆదివారం స్థానిక పోలీసు స్టేషన్ ఆవరణలో అవగాహన కల్పించారు. వాహన దారుడు తప్పని సరిగా నిబంధనలు పాటించాలని సూచించారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది ఉన్నారు.